

జిల్లాలో తగ్గుతున్న మిరపసాగు

- పంటను పట్టి పీడిస్తున్న చీడపీడలు
- నష్టాలతో పంట సాగును తగ్గించుకుంటున్న రైతులు
- జిల్లాలో కేవలం 500ల ఎకరాల్లో సాగు
- ఖమ్మం, వరంగల్, సోలాపూర్, హైదరాబాద్, గుంటూరు నుంచి తెస్తున్న వ్యాపారులు
- ఎర్ర బంగారం ధర కిలో రూ. 180

ముథోల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నిరుచులున్నా కారం రుచి వేరు. వంటకాల్లో నిత్యం వాడుకల్లో కారంచే ప్రధాన పాత్ర. పోపు డబ్బాలో మిరపగింజలు మొదలు ఎండుమిర్చి పొడిరూపంలో మన వంటకాల్లో విరివిగా వాడుతుంటారు. ఊరగాయలు మొదలు నిత్యం వండే కూరల వరకు మిర్చి కావాల్సిందే. దీని కోసం ప్రతి గృహిణి ఎండాకాలం వచ్చేసరికి అప్రమత్తమవుతుంది. మంచి సరుకు గిట్టుబాటు ధర కోసం ముథోల్‌కు వస్తారు. కొన్ని దశాబ్దాలుగా ముథోల్ ప్రాంతంలోని ఎండుమిర్చి అంటే మూడు జిల్లాలో ప్రసిద్ధి. మహారాష్ట్ర నుంచి కూడా ఇక్కడికి వచ్చి మిర్చి కొనుగోలు చేస్తారు. గతంలో ఎండాకాలంలో మిర్చి కొనుగోలు దారులతో సందడిగా ఉండేది. స్థానికులు అనేక మందికి ఉపాధి లభించేంది. సంవత్సరానికి సరిపడా మిర్చి కొనుగోలు చేసి ఇక్కడి మిషన్‌లో పొడి చేసుకొని తీసుకువెళ్లేవారు. రాను రాను పరిస్థితులు మారిపోయాయి. చీడపీడలు రావడం, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, కూలీల కొరత, ప్రభుత్వ ప్రోత్సాహం లేక పలు అంశాలు పంట దిగుబడులపై ప్రభావం చూపా యి. క్రిమి సంహారకాలు వాడాలంటే ఇక రైతులకు అంత ఆర్థిక పరిస్థితి లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఎండుమిర్చి పంట విస్తీర్ణం తగ్గి పోయింది. ఇదిలా ఉండగా స్థానిక వ్యాపారులు వివిధ ప్రాంతాల్లో ఎండుమిర్చి కొనుగోలు చేసి తీసుకువచ్చి స్థానికంగా మిర్చి మీదే అమ్మ కాలు జరుపుతున్నారు. ఎండుమిర్చి ధర పెరిగిపోవడంతో అందరి దృష్టి ఇటువైపు మళ్లింది. ఇప్పటికే స్థానిక మిర్చి పైనే వినియోగదారులు ఆసక్తి చూపుతున్న తగినంత సరుకు దొరకడం లేదు. జిల్లా అవసరాలకు తగినంత కూడా సరుకు ఇక్కడ దొరకడం లేదు. స్థానిక మార్కెట్‌కు రావడం లేదు. వినియోగదారులు కొందరు ఈ సీజన్‌లో ధర్మాబాద్ మార్కెట్‌కు వెళ్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఎండు మిర్చి ధర నానాటికి పెరిగిపోతుంది. ముథోల్ మార్కెట్‌లో ఎండుమిర్చి విక్రయ కేంద్రాల్లో సందడి మొదలైంది. జిల్లా పరిధిలోని ముథోల్, ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఈ సీజన్‌లో కేవలం 350 మంది రైతులు 500ల ఎకరాల మిర్చి పంట సాగైందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అంజి ప్రసాద్ తెలిపారు.

చీడ పీడలతో తగ్గిన దిగుబడి

ఎండు మిర్చిసాగులో రైతులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. గత నాలుగు- ఐదు సంవత్సరాల నుంచి పంట తొలి దశలో రసం పీల్చే పురుగు ఉధృతి తీవ్రంగా ఉంది. దీంతో మందుల వాడకం ఎక్కువైంది. మరోపక్క ముడత రోగం వ్యాప్తి చెందడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఈ నేపథ్యంలో రైతులు మిర్చి సాగుపై మక్కువ చూపలేదు. దీంతో మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందని చెప్పుకోవచ్చు. 2020లో జిల్లాలో మిర్చిసాగు 110 మంది రైతులు 67 ఎకరాల 21 గుంటలు సాగుచేయగా 2021లో 47 మంది రైతులు 46 ఎకరాల 13 గుంటలు సాగుచేశారు. 2023లో 220 మంది రైతులు 450 ఎకరాల్లో సాగుచేయగా, 2024లో 450 మంది రైతులు 825 ఎకరాలు సాగుచేశారు. ఈ ఏడు 350 మంది రైతులు 500ల ఎకరాల్లో సాగుచేశారు. అంటే ఈయేడు మిర్చి సాగుతగ్గింది. చీడపీడల మూలంగా పెట్టుబడి పెట్టి మిరపపంటలు సాగు చేసిన రైతన్నలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో రైతులు సుమారు గత నాలుగు - ఐదు సంవత్సరాల నుండి మిరప సాగుపై మక్కువ చూపడం లేదు.

ఎగిరి పడుతున్న ఎర్ర బంగారం ధరలు

ప్రస్తుతం ముథోల్ మండల కేంద్రంలో తేజరకం ఎండు మిర్చి కిలో 180 వరకు పలుకుతుంది. సాధారణ రకం ధర కిలో 150 నుండి 160 వరకు పలుకుతుంది. ఇక్కడ వ్యాపారులు మహారాష్ట్రలోని సోలాపూర్ అలాగే మన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, ఆంధ్రలోని గుంటూరు ప్రాంతం నుంచి ఎండు మిర్చి కొనుగోలు చేసి ముథోల్‌లో విక్రయిస్తున్నారు. జిల్లా నుంచి కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర సైతం వినియోగదారులు వచ్చి ఎండు మిర్చి కొనుగోలు సైతం చేస్తారు. ఈసారి గత సంవత్సరం కంటే మన జిల్లాలో మిరప సాగు కొద్దిమట్టుకు తగ్గింది. ఈయేడు కూడా కిలో ఎండుమిర్చి ధర 170 నుండి 180 వరకు పలుకుతుంది. రెండవ రకం మిర్చి 150 వరకు పలుకుతుంది. జిల్లాలోని భైంసా, నిర్మల్ ప్రాంతాల్లో ఎండు మిర్చి విక్రయాలు అంతంత మాత్రమే. ముథోల్ ప్రాంతంలో మెండుగా జరుగుతాయి. ఏదేమైనా ముందు ఎండు మిర్చి ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

రైతులకు ప్రోత్సాహం ఏది ?

ప్రస్తుతం వాణిజ్య పంటలు పత్తి, సోయా ఆధిపత్యాన్ని చూపతున్నాయి. స్థానిక విత్తనం పంట కాపాడుకోవడం కత్తి మీద సామే. స్థానిక అవసరాలకు తగినట్టు తక్కువ క్రిమిసంహారకాలతో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం వాడి ఎండు మిర్చి పంటను పండించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనికి తగిన ఆర్థిక దన్ను పరిజ్ఞానం అన్నదాతలకు వ్యవసాయ శాఖ అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

నిర్మల్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఇంటర్ విద్యాశాఖ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షాకేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 6,323 మందికి గాను 5,971 మంది విద్యార్థులు హాజరయ్యారని, 352 మంది విద్యార్థులు హాజరు కాలేదన్నారు. ఒకేషనల్ విభాగంలో 621 మంది విద్యార్థులకు గాను 539 మంది విద్యార్థులు హాజరుకాగా 82 మంది విద్యార్థులు హాజరు కాలేదని అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రభుత్వ బాల, బాలికల జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరీక్షల తొలిరోజు అయిన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాల నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా..? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా..? లేదా అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్‌ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, తదితరులు ఉన్నారు.

మొదటిరోజు 45 మంది విద్యార్థుల గైర్హాజరు

ఖానాపూర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఖానాపూర్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఉండగా ప్రభుత్వజూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 293 మంది విద్యార్థులకు గాను 283 మంది విద్యార్థులు హాజరయ్యారు. పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బీఆర్‌ఎస్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 319 మంది విద్యార్థులకు గాను 284 మంది విద్యార్థులు హాజరయ్యారు. 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తనికి మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగియగా 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ సుజాత, ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్‌లు పరిశీలించారు.

ప్రశాంతంగా పరీక్షలు

దిలావర్‌పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో బుధవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్‌లు తెలుగు, హిందీ పరీక్షలకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

గోదావరిలో పడి ఒకరి మృతి



నదిలో మునిగి మృతి చెందిన డోన్‌గాలే మారుతి

బాసర, మార్చి, 5 : (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు పడిపోయి బాసర మండలం బిద్రెల్లి గ్రామానికి చెందిన డోన్‌గాలే మారుతి (34) మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ తెలిపారు. గోదావరి స్నానం కోసం నదిలో దిగిన మారుతి ప్రమాదవశాత్తు నీటిలో జారుకొని మరణించినట్లు చెప్పారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళకు ఇటీవలే కుటుంబ సభ్యులతో వెళ్లి వచ్చిన మారుతి బాసర గోదావరి తీరంలో పుష్కర స్నానం కోసం బాసర వచ్చినట్లు పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరి మృతి



సోన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి (54) సరస్వతీ కాలువలో మంగళవారం చేపలు పట్టడానికి వెళ్లింది. లక్ష్మీబాయి సరస్వతీ కాలువ ఒడ్డు మీద కూర్చొని చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు లక్ష్మీబాయి గురించి వెతుకుతుండగా బుధవారం ఉద యం మృతదేహం లభ్యమైంది. మృతురాలి కొడుకు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ హైమద్ మోహినుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోదావరి నదిలో జారిపడి వ్యక్తి మృతి

కడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల గోండుగూడ గ్రామానికి చెందిన పందిరి జలపతి(56) పొలం పనులకు వెళ్లి సమీప గోదావరినదిలో స్నానం చేయడానికి వెళ్లగా ప్రమాదశాత్తు కాలుజారి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

నర్సాపూర్(జి), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన రాథోడ్ మారుతి(44) అనే వ్యక్తి గత పది రోజుల క్రితం ఇంట్లో నుండి వెళ్లిపోయాడని, అప్పటి నుండి తన ఆచూకీ గురించి మారుతి కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇళ్లలో, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా తన జాడ తెలియకపోయేసరికి బుధవారం మారుతి భార్య రాథోడ్ అరుణ్ తన భర్త ఆచూకీ తెలుసుకోవడానికై నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్ దరఖాస్తు ఇవ్వగా ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సదరం కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం) కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభిన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయించే వారని, ఇప్పుడు మీ సేవలతో పాటు యూడీఐడీ పోర్టల్, సొంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపుల వివరాలు కూడా మెసేజ్‌ల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల నుంచే అమలులోకి తీసుకురావడం జరిగిందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యూడీఐడీ (యూనిక్ డిజేబిలిటీ ఐడీ) కార్డులను పొందవచ్చని ఆమె తెలిపారు. సదరం కార్డును పోస్టల్ ద్వారా సంబంధిత వ్యక్తులకు చేరవేయడం జరుగుతుందన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, వారికి ప్రస్తుతం ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు వర్తిసాయని ఆమె పేర్కొన్నారు. దివ్యాంగులు ఎలంటి అపోహలకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు జారీ చేసే క్రమంలో వైద్య బృందానికి అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గోపాల్, సునీల్, సురేష్, డీపీఎం శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

జిల్లాలో పోలీసు అక్క పేరుతో వినూత్న కార్యక్రమం

- విద్యార్థినులు, మహిళల రక్షణ కోసమే : ఎస్పీ జానకి షర్మిల



జూమ్ సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ పోలీసు అక్కపేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 18 మంది మహిళా అధికారులతో జూమ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ ఈ సందర్భంగా మాట్లాడుతూ... దిశానిర్దేశం చేశారు. సైబర్ నేరాలు, ఇతర వ్యవహారాల్లో విద్యార్థినులు బాధితులవుతున్నారని తెలిపారు. పోలీసు అక్క అనే సరికొత్త ఆలోచనతో నిర్మల్ పోలీసుశాఖ ముందడుగు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 18 పాఠశాలలకు 18 మంది మహిళా పోలీసులను సంధానకర్తలుగా నియమించి పర్యవేక్షిస్తామన్నారు. ఒక్కో మహిళా పోలీసు ఒక కేజీబీవీ పాఠశాలను దత్తత తీసుకుంటారన్నారు. జూమ్ సమావేశాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షించనున్నట్టు ఎస్పీ వివరించారు. విద్యార్థుల్లో మనోధైర్యం నింపి ఎలాంటి సమస్యలైనా ఎదుర్కొనేలా కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. మహిళా పోలీసు నెలలో ఒక రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే బస చేస్తారన్నారు. వారితో మమేకమై సాధక బాధకాలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా కేజీబీవీలకు చెందిన వీపీసీ ఇన్‌చార్జీలకు పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేష్ మీనా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలను సందర్శించిన ఎస్పీ

నిర్మల్ రూరల్ / సోన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అనంతరపేట్, సోన్, నిర్మల్ అర్బన్ కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు జిల్లా ఎస్పీ జానకిషర్మిల బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు అక్క పేరుతో మహిళా పోలీసు పాఠశాల దత్తత తీసుకునే విధంగా చేశానని, అదే విధంగా విద్యార్థినులకు స్థితిగతులు, సైబర్ క్రైమ్, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్ అగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, పోలీసులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులతో..

ముథోల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ డా.జానకిషర్మిల మహిళలు, బాలికల భద్రతయే నా బాధ్యత అనే సంకల్పంతో పోలీసు అక్క అనే కార్యక్రమాన్ని నూతనంగా ప్రారంభించారు. అందులో భాగంగా బుధవారం రాత్రి మండల కేంద్రమైన ముథోల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఎస్సై సంజీవ్, పీడబ్ల్యూసీ రాజమణిలు రాత్రి సందర్శించారు. పోలీసు అక్క కార్యక్రమంలో భాగంగా పీడబ్ల్యూసీ రాజమణి విద్యార్థులతో కలిసి రాత్రి అక్కడే బస చేయడంతో పాటు విద్యార్థినుల స్థితిగతులు తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించడం, ఆ రోజు అక్కడే భోజనం, విద్యార్థినుల స్థితిగతులను, సైబర్ క్రైమ్, బ్యాడ్, గుడ్ టచ్‌లతో పాటు భద్రతపై సమీక్ష, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మలేషియాలో జైలుశిక్ష బాధితులకు జాన్సన్‌నాయక్ అండ

- స్వయంగా మలేషియా జైలుకు వెళ్లి బాధితులతో ములాఖత్ అయిన జాన్సన్‌నాయక్
- వారి విడుదలకు కృషి చేస్తానని హామీ
- సొంత డబ్బులతో మలేషియాలో న్యాయవాది నియామకం

ఖానాపూర్/కడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మలేషియాలో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అండగా నిలిచారు. గత కొన్ని నెలలుగా కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురజాల శంకర్, గురజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామానికి చెందిన యమునూరి రవీందర్‌లు మలేషియా జైల్లో మగ్గుతున్నారు. ఇటీవల వారి కుటుంబ సభ్యులు జాన్సన్‌నాయక్‌ను కలిసి తమ వారిని మలేషియా జైలు నుంచి విడిపించేలా సహ కరించాలని కోరారు. దీంతో ఆయన స్వయంగా మలేషియా దేశానికి వెళ్లి బుధవారం అక్కడి జైల్లో ఉన్న ఖానాపూర్ నియోజకవర్గ వాసులను ములాఖత్ అయ్యారు. ఉపాధి నిమిత్తం తామంతా మలేషియా దేశానికి వచ్చామని తాము చేయని తప్పులకు అకారణంగా జైల్లో ఉన్నట్లు బాధితులు జాన్సన్‌తో ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారిని విడిపించేందుకు అక్కడి ఉన్నతాధికారులను సంప్రదించగా వారు అక్రమ ఆయుధ చట్టం 'ది మలేషియా ఆర్మ్ యాక్ట్' కింద జైల్లో ఉన్నారని అక్కడి అధికారులు తెలిపినట్లు జాన్సన్ పేర్కొన్నారు. దీంతో వారు ఎటువంటి నేరం చేయలేదని ఉపాధి కోసం మలేషియా దేశానికి వలస వచ్చినట్లు అక్కడి అధి కారులకు జాన్సన్ వివరించినట్లు పేర్కొన్నారు. భారత దేశంలో వారి కుటుంబ నేపథ్యాలను దయనీయ పరిస్థితిని అక్కడ అధికారులకు వివరించగా వారు న్యాయవాదులను నియమించుకోవాలని సలహా ఇచ్చారని తెలిపారు. దీంతో తన సొంత డబ్బులతో బాధితులను మలేషియా జైలు నుండి విడిపిం చేందుకు మలేషియాలో ప్రత్యేక న్యాయవాదులను నియ మించినట్లు జాన్సన్ పేర్కొన్నారు. మలేషియా జైల్లో అకారణంగా మగ్గుతున్న ఆరుగురిని విడిపించేందుకు వారిని తిరిగి స్వదేశానికి చేర్చేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని జాన్సన్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు.



మలేషియాలో జైలు అధికారులతో జాన్సన్ నాయక్

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : దేశాభి వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళ వారం సాయంత్రం ఆయన ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బేటీ బచావో - బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జనవరి 22 నుంచి మార్చి 8 వరకు 45 రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మహిళా విద్య ఆవశ్యకత, మహిళా సాధికారత, బాలికలు, మహిళల హక్కులు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థి దశ నుండే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు తదితర అంశాలపై అవగాహన పెంపొందించాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పని చేసే మహిళా సంక్షేమ అధికారులు సమాజంలో బాలికలు, మహిళలకు ఇబ్బందులు కలిగితే వెంటనే రక్షణచర్యలు చేపట్టాలని సూచించారు. 100, 1098, 181, 1930 హెల్ప్ లైన్ నెంబర్లపై బాలికలు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళల అభివృద్ధికి చేయూత అందించాలన్నారు. లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జి. రాధిక మాట్లాడుతూ... మహిళలు, బాలికలకు చట్టాల పైన, హక్కులపై విస్తృ త అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు న్యాయ పరమైన సహాయాన్ని అందిస్తామని తెలి పారు. బాల్య వివాహ నిర్మూలన చట్టం 2006పై చైతన్యపరచాలని సూచించారు. అనంతరం బేటీ పడావో - బేటీ బచావో ప్రతిజ్ఞ చేసి పోస్టర్ ఆవిష్కరించారు. సీడీపీవో నాగమణి, జిల్లా వైద్యాధికారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో బాలికలకు ఉన్నత స్థానం

విద్యతో బాలికలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో సమావేశ మయ్యారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది సందర్భంగా విద్యార్థులతో ఆయన వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మహిళలకు, విద్యార్థినులకు ఉన్న చట్టాలను తెలుసుకోవాలన్నారు. బేటీ బచావో - బేటీ పడావో ప్రాముఖ్యతను వివరించారు. హెల్ప్ లైన్ నెంబర్లు, బాల్య వివాహ నిర్మూలన, మహిళా హక్కుల చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు తెలియజేశారు. అధికారులు ఆయనతో పాటు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

నిర్మల్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో గృహ, వాణిజ్య పన్ను వసూలు, శానిటేషన్ తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.


ప్రశాంస పత్రాలను అందుకుంటున్న డిగ్రీ విద్యార్థులు

రాష్ట్రస్థాయికి ఎంపికైన డిగ్రీ విద్యార్థులు

ఇచ్చోడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని ఐదు గిరిజన గ్రామాలను ఎంపిక చేసుకొని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జే.అనిత ఆధ్వర్యంలో గిరిజన మహిళలు డిజిటల్ లావాదేవీల ప్రభావం అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. బుధవారం హైదరాబాద్‌లోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల నాంపల్లిలో ప్రదర్శించి జెడీ రాజేందర్‌సింగ్, ఆర్‌జేడీ యాదగిరి చేతుల మీదుగా ప్రశాంస పత్రాలను ఇచ్చోడ కళాశాలకు చెందిన విద్యార్థులు అనిల్, శరణ్య, దీపిక శ్రీయ, శ్రీధర్‌లు అందుకున్నారు. అంతేకాకుండా ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిగ్నాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు విద్యార్థులకు ప్రశాంస పత్రాలను అందుకున్నారు. ఇచ్చోడ కళాశాల నుంచి ఎంపికైనందుకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

తాంసి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని మండలంలోని తాంసి, భీంపూర్, తలమడుగు మండల రైతులు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. బుధవారం సాయంత్రం సంబంధిత శాఖ అధికారులను కలిసి తమ మొర వినిపించారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చి పక్షం రోజులు కావొస్తున్నా.. ఇంకా స్పందించకపోవడం ఏమిటని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. రైతు ప్రభుత్వంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. అంతేకాకుండా ప్రైవేట్ వ్యాపారస్తులు ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల తాము పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని మూడు మండల రైతులు కోరుతున్నారు.

సెల్ టవర్ల ఏర్పాటుకు ముందడుగు

బజార్‌హత్నూర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాలలో సెల్ ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో నేటికీ ఈ ఆధునిక ప్రపంచానికి ఆ పల్లెలు దూరంగానే ఉంటున్నాయి. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు డేర్రా, గిరిజాయి, మాన్కపూర్ గ్రామాలలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు బుధవారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. మారుమల గ్రామాలలో ప్రజలకు ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని మండల తహసీల్దార్ శ్యాంసుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నూర్‌సింగ్, ఎంసి బాపురావు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

బోథ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గత దశాబ్దాలకాలంగా బోథ్ బస్టాండ్‌లో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే ఎట్టకేలకు బుధవారం ఆర్టీసీ డీఈ అంజనేయులు, ఏఈ అజయ్‌ల ఆధ్వర్యంలో ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. తొమ్మిదిన్నర లక్షల రూపాయలతో గోడ నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. అయితే బస్టాండుకు మూడువైపులా గోడ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వివరించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

● బోథ్ సీఐ వెంకటేశ్వరరావు

బోథ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం బోథ్ బస్టాండ్‌లో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరికీ ఓటీపీ చెప్పవద్దని, ఓటీపీ చెబితే తమ అకౌంట్లో ఉన్న డబ్బులు మాయం అవుతాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన ఆందోళన గురి కాకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన వివరించారు. పోలీస్ స్టేషన్ నెం.కు లేదా డయల్ వందకు, అలాగే డయల్ 112 కాల్ చేయాలని సూచించారు. అంతేగాక సైబర్ నేరాల అదుపునకు ప్రభుత్వం ప్రత్యేకమైన టోల్ ఫ్రీ నెంబర్ కేటాయించిందని, 1930 నెంబర్‌కు కాల్ చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు ఫేస్‌బుక్‌లు, ఇన్‌స్టాగ్రామ్‌లను వినియోగించినట్లయితే జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. తర్వాత ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ బుధవారం ఉమెన్ సైబర్ జాగృతి దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ముఖ్యంగా ఈ కార్యక్రమం మహిళలు మోసపోకుండా ఉండేందుకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బుధవారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దుబ్బాక సునీల్ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాథోడ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న ఎస్సై దుబ్బాక సునీల్

ఆదిలాబాద్ రూరల్: మహిళా సైబర్ జాగృతి దినోత్సవ సందర్భంగా డీఎస్పీ హసీబుల్లా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ జాగృతి దివస్ నిర్వహించారు. సైబర్ బానిసత్వం, డిజిటల్, ఉద్యోగ మోసాలు, వేధింపులు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, ప్రిన్సిపాల్ అతిక్ బేగం, ఐటీ కోర్ రియాజ్, షీ టీం ఏఎస్సై సునీత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెస్తాం

● ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

జైనథ్ మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తెస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాలయ శంకర్, బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందంలు అన్నారు. బుధవారం సాత్నాల మండలంలోని సైద్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుమన్‌బాయి, దౌనసర్పంచ్ వినోద్, పీఏసీఎస్ రాథోడ్ రోహిదాస్‌లతో పాటు సుమారు 300 మంది బీజేపీ పార్టీలో చేరారు. సదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ రైతుభరోసా ఇవ్వక రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడు అస్తక్ సుభాస్, మండల ప్రధాన కార్యదర్శి పోతరాజు రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బోయర్ విజయ్, నాయకులు సురేష్, రాము, తారు, దినేష్ ప్రమోద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన వారితో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్

● 'నీటి సమస్య పరిష్కారం చేయాలి'

నార్నూర్: రెండు నెలల నుంచి గ్రామంలో తీవ్రమైన నీటి సమస్య ఉన్న సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదంటూ సుంగపూర్ గొండ్ గూడా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులకు చాలాసార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేక గ్రామానికి చెందిన పలువురు ఆదివాసీ నాయకులు ఎంపీ గోడం నగేష్ వారి క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామంలో ఉన్న సమస్యను పరిష్కారం చేయాలంటూ కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి లచ్చు, తెలంగ్‌రావు, చిత్రు, లక్ష్మణ్, సుభాష్,షేకు మదు, దేవరావు పాల్గొన్నారు.

యువకుడిపై చేయి చేసుకున్న ట్రాఫిక్ సీఐ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్ర వాహనదారుడిపై ఆదిలాబాద్ పట్టణ ట్రాఫిక్ సీఐ చేయి చేసుకున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. బుధవారం రాత్రి జిల్లాకేంద్రంలోని విద్యానగర్ కాలనీ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురి వాహనాలను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయగా.. ఓ యువకుడికి ట్రాఫిక్ పోలీస్‌లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ట్రాఫిక్ సీఐ అక్కడికి చేరుకొని ఆ యువకుడిపై చెయ్యి చేసుకుంటూ బూతులు తిడుతూ దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కోడ్ ఉల్లంఘించిన ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు చేయాలి : రూపేష్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన బీజేపీకి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేసిన ప్రభుత్వ ఉద్యోగి, ఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు నంద అశోక్‌పై కేసు నమోదు చేయాలని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను కలిసి అదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు. సదరు ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రస్థాయిలో సైతం ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

రూ.10 కోట్ల నిధులపై పంచాయితీ

(5వ పేజీ తరువాయి...)

ఇన్‌చార్జీల ఆమోదంతోనే కేటాయించాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ప్రజల మద్దతుతో గెలిచిన ఎమ్మెల్యేలు మాత్రం నియోజకవర్గంలో తామే సుప్రీం అంటూ చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలలో అధికార పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితే ఎదురవుతోంది. అధికారంలో కాంగ్రెస్ ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందడంతో అభివృద్ధి పనుల మంజూరుపై ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎమ్మెల్యేలకు అనుకూలంగా వ్యవహరించినా.. మాట్లాడినా.. సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులతో ప్రభుత్వం జిల్లా అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య ఆధిపత్య పోరు కనిపిస్తోంది. నేతలు పట్టు పంతాలకు పోకుండా నియోజకవర్గ అభివృదే ధ్యేయంగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

రిమ్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. దాదాపు 50 సంవత్సరాల వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆస్పత్రి పీఆర్డీ వందన తెలిపారు. గత నెల 26న ఆస్పత్రి ఎంఐసీయూలో అతనిని ఎవరో చేర్చారన్నారు. అతనితో సహాయకులు ఎవరు లేరన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్ర పర్చామన్నారు. ఎవరైనా గుర్తిస్తే రిమ్స్ లేదా 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఎవరూ రాకపోతే మృతదేహాన్ని మున్సిపాలిటీకి అప్పగిస్తామని పేర్కొన్నారు.

ఘన్పూర్‌లో ఇల్లు దగ్ధం

ఉట్నూర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్పూర్ గ్రామంలో ఆదివాసీ గిరిజనుడికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధం కావడంతో రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. పంద్రా గంగాధర్‌కు చెందిన ఇంట్లో బుధవారం ఉదయం దేవుడి గూటిలో వెలిగించిన దీపం వత్తులను ఎలుకలు ఇంటి పైకప్పులోకి తీసుకు వెళ్లడంతో.. ఇంటికి నిప్పు అంటుకుందని బాధితులు తెలిపారు. ఇంట్లో ఉన్న రూ.60 వేల నగదుతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు దగ్ధం కావడంతో రూ.రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు గంగాధర్ వివరించారు. గ్రామస్థుల సహకారంతో మంటలను ఆర్పడం జరిగిందని మాజీ ఎంపీపీ పంద్రా జయవంతరావు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

మాజీ ఎంపీటీసీపై విచారణ

ఇచ్చోడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి: మాజీ ఎంపీటీసీ చౌహాన్ దేవానంద్ ఎస్టీ లంబాడా జాతికి చెందిన వ్యక్తి కాదని లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం ఇచ్చోడలోని ఆయన స్వగృహంలో హైదరాబాద్ ట్రైబల్ కమిషన్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు విచారణ జరిపినట్లు సమాచారం. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు వారు ఇచ్చిన ఫార్మెట్ ఆధారంగా దాదాపు రెండు గంటల పాటు విచారణ జరిపినట్లు తెలిసింది. దేవానంద్ కుటుంబ సభ్యుల నేపథ్యం వారి భాషా, వారి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకున్నట్లు సమాచారం. విచారణ అధికారులతో పాటు ఐటీడీఏ ఏపీవో జాదవ్ వసంత్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌లు ఉన్నారు.

పోలీసుస్టేషన్‌కు బాలుడి అప్పగింత


బోథ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బోథ్ పోలీస్ స్టేషన్‌కు గుర్తుతెలియని బాలుడిని సోనాల వాసులు అప్పగించారు. మంగళవారం రోజున నిర్మల్ నుంచి ఆటోలో వస్తున్న వారికి రోడ్డుపై నడిచి వస్తున్న ఓ బాలుడు రానాపూర్ సమీపంలో ఆటోను అడ్డగించాడు. అయితే ఎండలో నడిచి వస్తున్న బాలుడిని ఆటోలో తీసుకువచ్చి తమ ఇంటి వద్ద ఉంచుకున్నారు. బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగింది. దీంతో ఎస్సై ప్రవీణ్ కుమార్ బాలుడిని చైల్డ్‌వెల్ఫేర్ సెంటర్‌కు పంపించడం జరిగింది. అయితే బాలుడు తమ తల్లి పేరు నాగమణి అని, తండ్రి చందు, తన పేరు అభి అని పేర్కొంటున్నాడు. అయితే పూర్తి వివరాలు తెలియకపోవడంతో బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ ఆదిలాబాద్‌కు పంపిస్తున్నామని తెలిపారు.

పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి హాజరైన నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బుధవారం గాంధీభవన్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశానికి నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు హాజరయ్యారు. కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా నాయకులు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

నర్సాపూర్(జి), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్ల దగ్ధమైన ఘటన మండలంలోని బూరుగుపల్లి(జి) హనుమాన్ తండాలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. రాథోడ్ దినేష్‌కు చెందిన ఇంట్లో ఫ్యాన్‌లో మంటలు చెలరేగి షార్ట్ సర్క్యూట్ జరిగింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలు అదుపు చేశారు. వంట సామాగ్రి, ఫర్నిచర్, నగదు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితుడు వెల్లడించారు. సంఘటన స్థలానికి గిర్దావర్ సుమలత చేరుకుని పంచనామా నిర్వహించారు. ఆరు లక్షల నుండి ఎనిమిది లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

తుమ్మల దేవరావుకు కవిసంధ్య పురస్కారం

నిర్మల్ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కవిసంధ్య సాహితీ సంస్థ నిర్వహించిన జాతీయ కవితా పోటీల్లో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ తుమ్మల దేవరావు పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. ఆయన రచించిన 'వరిగోలకులు' కవితకు కన్సోలేషన్ బహుమతి లభించినట్లు అధ్యక్షుడు డాక్టర్ శిఖామణి, ప్రధాన కార్యదర్శి దాట్ల దేవదానం రాజు ప్రకటించారు. ఈ నెల 23న తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో పురస్కారం అందుకోనున్నారు.

డిగ్రీ ఫలితాల్లో దీక్ష కళాశాల విద్యార్థుల ప్రభంజనం

నిర్మల్ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ బుధవారం ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో దీక్ష కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలు వెలువడ్డాయి. మావియా తస్లీమ్ బీఎస్సీ 3వ సెమిస్టర్‌లో 9.55 గ్రేడ్‌లో నిలిచింది. డి. శ్రీజ 9.33, కే. అనూష 9.25 గ్రేడ్‌తో యూనివర్సిటీ స్థాయి గ్రేడ్ పొందారు. 5వ సెమిస్టర్‌లో జి. విహారి 9.20, జుబియా 9.19, నేహ 9.09, సబా 9.05 గ్రేడ్ సాధించగా విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ సాధించారు. డైరెక్టర్లు వెంకటరెడ్డి, ప్రమోద్, ప్రిన్సిపాల్ మెంగా శ్రీధర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

తర్లపాడ్, ఖానాపూర్ రహదారిపై తృటిలో తప్పిన ప్రమాదం


రెంకోని వాడు వద్ద మట్టిలో దిగబడి ఒక పక్క ఒరిగిన లారీని జేసీబీల సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

ఖానాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్, తర్లపాడ్ రహదారిలో రెంకోని వాగుపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద ఓ లారీకి పెను ప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళ్తే ఏపీ 01 టీఏ 1215 అనే నెంబర్ గల లారీ నిర్మల్‌లోని రైతుబజార్‌లో మొక్కజొన్న బస్తాలను లోడ్ చేసుకొని కరీంనగర్ వెళ్లేందుకు బయలు దేరింది. కాగా మార్గమధ్యంలో ఆకలి వేస్తుందని డ్రైవర్ ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్‌లో గల ఓ దాబాలో భోజనం చేసి తిరిగి ఖానాపూర్ మీదుగా కరీంనగర్ వెళ్తుండగా వంతెన నిర్మాణంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డుపై లారీ దిగబడింది. దీంతో లారీ ఒక పక్కకు వంగిపోయి బోల్తా పడేలా నిలిచిపోవడంతో వెంటనే ఆ లారీని డ్రైవర్ అక్కడే నిలిపి వేశాడు. దీంతో బుధవారం ఉదయం 11 గంటల వరకు ఖానాపూర్ - తర్లపాడ్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఖానాపూర్ నుండి మంచిర్యాల వైపు వెళ్లే వాహనాలన్నీ కొమరం భీమ్ చౌరస్తా మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా మట్టిలో కూరుకుపోయి ఒక పక్క ఒరిగిన లారీని బయటకు తీసేందుకు మూడు జేసీబీలు మూడు గంటల పాటు శ్రమించి లారీని బయటకు తీయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెంకోని వాగుపై నిర్మిస్తున్న వంతెనను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మన్మథ్, రాజూర గ్రామ పంచాయతీలను పరిశీలించిన డీపీవో

లోకేశ్వరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్, రాజూర గ్రామ పంచాయతీలను బుధవారం డీపీవో శ్రీనివాస్ సందర్శించారు. ఇందులో భాగంగా రాజూరలో పారిశుద్ధ్య పనులను, పల్లె ప్రగతి ఆస్తులు, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రాజూరలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే బాల, బాలికలకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పిల్లలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు నవీకరణ చేసుకోవాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే మన్మథ్ గ్రామ పంచాయతీని పరిశీలించారు. మన్మథ్ గ్రామపంచాయతీలో గల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. అందులో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు ఆయన మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈయనతో పాటు డీపీవో సల్మాన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

బిల్డింగ్ పెయింటర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి


భైంసా ఆర్‌డీవో కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న బిల్డింగ్ పెయింటర్స్, కూలీలు

భైంసా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, పొరుగు రాష్ట్రాల వలస కార్మికులతో జిల్లాలోని బిల్డింగ్ పెయింటర్స్, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భైంసా డివిజన్ బిల్డింగ్ పేయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతికూల పరిస్థితులతో ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగా ఉంటున్న నేపథ్యంలో పెయింటర్స్ జీవన పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. పనులు లేక కూలీల కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితులు నెలకొన్నాయని అవేదన వ్యక్తం చేశారు. భైంసా డివిజన్ పేయింటర్స్ యూనియన్ శ్రేణులు కూలీలతో కలిసి పట్టణంలోని ప్రధాన వీదుల మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డీవో, కార్మికశాఖ కార్యాలయంలో వినతిపత్రాలు అందచేశారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

ఖానాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని ఖానాపూర్ మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్‌రావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఇంటి పన్నులను 100 శాతం పూర్తి చేసేలా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కోరారు.

తానూర్ సొసైటీ ద్వారా చెక్కు పంపిణీ

తానూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని వడ్‌గాం గ్రామానికి చెందిన మధునురే రావుసాబ్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. కాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం హెడ్‌క్వార్టర్ తానూర్‌లో మృతుడు వ్యవసాయ పంట రుణం తీసుకోవడం వలన అతని పేరిట బీమా కంపెనీకి సొసైటీ వారు ఇన్సురెన్సు కట్టడంతో రూ.2లక్షలు బీమా మంజూరయింది. బుధవారం పీఏసీఎస్ హెడ్‌క్వార్టర్ తానూర్ సంఘం చేత పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావుపాటిల్, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, సీఈవో భూమయ్య చేతుల మీదుగా సంబంధిత చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల, మార్చి, 5 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలకు చెందిన మాజీ పట్వారీ సాదుల లింబగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం కుటుంబ సభ్యులను మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్‌రావు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను కుమారులు గోవర్ధన్, సుదర్శన్‌లను అడిగి తెలుసుకున్నారు.

పొరపాటున కేటాయించిన కేంద్రం కాకుండా మరో కేంద్రంకు చేరుకున్న విద్యార్థి

● వెంటనే తెలుసుకొని కేటాయించిన కేంద్రంకు పరుగులు

● సకాలంలో విద్యార్థికి పరీక్షా కేంద్రానికి చేరవేసిన ముథోల్ ఎస్సై


1.పరీక్షసెంటర్‌కు సకాలంలో విద్యార్థిని తీసుకువచ్చిన పోలీసువాహనం 2. వాహనం దిగి పరీక్ష సెంటర్‌లోకి విద్యార్థి పరుగులు

ముథోల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. అయితే ఓ ఇంటర్ విద్యార్థి తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా మరో పరీక్షా కేంద్రానికి వెళ్లాడు. అక్కడ తనకు కేటాయించిన కేంద్రం కాదని విషయం తెలుసుకొని వెంటనే తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరటానికి పరుగులు పెట్టాడు. సుమారు కిలోమీటర్ దూరం వెళ్లాల్సి ఉంటుంది. విద్యార్థి ఆందోళనను గమనించిన ముథోల్ ఎస్సై సంజీవ్ తన పోలీసువాహనంలో పరీక్షా కేంద్రానికి విద్యార్థిని చేర్చి పరీక్ష రాసేలా చేశారు.

విద్యార్థులు ఒత్తిడికి లోను కావద్దు

నిర్మల్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కావద్దని, పరీక్షలు అంటే భయపడవద్దని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జుమ్మెరాత్ పేట్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన మోటవేషనల్ క్లాసెస్‌లో విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకాగ్రత కోల్పోకుండా, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబు, టీచర్లు దత్తురాం, వసంత్ రావు, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, గంగాధర్, సుంక రాజన్న, వినోద్, శ్రీమంత్, రమణ, మంజుల, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం కేజీబీవీ విద్యార్థులకు 'పోలీసు అక్క అండ'

లోకేశ్వరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో మహిళా దినోత్సవం సందర్భంగా పోలీసు అక్క పేరుతో నూతన కార్యక్రమానికి నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా లోకేశ్వరం కేజీబీవీ పాఠశాలకు వినీత కానిస్టేబుల్‌ను అనుసంధాన కర్తగా నియమించారు. వారు పాఠశాలను దత్తత తీకోసుకొని విద్యార్థులకు అండగా ఉంటూ పాఠశాలలో సైబర్ నేరాలు, స్త్రీలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తారని లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు.

లోకేశ్వరంలో ఆరోగ్య పరీక్షలు

లోకేశ్వరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలో బుధవారం బాలింతలు, గర్భవతులు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, నెలసరి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మరియా, ఆశా వర్కర్లు గోదావరి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

గుండంపల్లిలో చలివేంద్రం ప్రారంభం

దిలావర్‌పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : దాహార్తుల దాహం తీర్చేందుకు గుండంపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం చలి వేంద్రాన్ని ఎంపీవో గోవర్ధన్ ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి కాలనీ వాసుల ఆర్థిక సహాయం

ఖానాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాజీనగర్ కాలనీలో ఇటీవల అకాల మరణం చెందిన ఆమంద కిరణ్ కుటుంబానికి ఆ కాలనీ వాసులు అండగా నిలిచారు. ఆ కుటుంబాన్ని ఓదార్చిన కాలనీ పెద్దలు బుధవారం వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని, సరుకులు అందజేశారు.

ఫటా..ఫట్...

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి

● శిరీషారెడ్డి, ఏపీవో, ముథోల్



ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని జాబ్ కార్డులున్నాయి? ఎంతమంది లేబర్లు ఉన్నారు?

ఏపీవో: మండలంలోని 19 గ్రామ పంచాయతీలకుగాను 9,573 జాబ్ కార్డులున్నాయి. ఇందులో పని చేసే జాబ్ కార్డులు 6,178 ఉన్నాయి. ఈ జాబ్ కార్డుల్లో 11,626 మంది లేబర్లున్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం ఏఏ పనులు జరుగుతున్నాయి?

ఏపీవో: మండలంలోని ఆయా గ్రామాల్లో ఫారం పండ్, మట్టి రోడ్లు, ఫీడర్ ఛానల్, యతన్ బండింగ్, భూమి చదును, సోఫిట్స్, న్యాడప్ కంపోస్టు తయారీ, పశువుల పాకలు కట్టడం, తదితర పనులు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: కూలీలకు దినసరి కూలీ ఎంత...? సమయ పాలన ఏంటి...?

ఏపీవో: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు చేసిన పని కొలతల ప్రకారం దినసరి కూలీ రూ. 300లు చెల్లించడం జరుగుతుంది. ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు పని చేయాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము.

ఆంధ్రజ్యోతి: ఎండాకాలం దృష్ట్యా పని చేసే చోట ఎలాంటి సౌకర్యం కల్పిస్తున్నారు...?

ఏపీవో: పని చేసే చోట కూలీలకు టెంట్ ఏర్పాటు చేయడం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. ప్రతి జాబ్ కార్డు లేబర్లు వంద శాతం పని దినాలను పూర్తి చేసుకోవాలని కోరుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం ఎంత మంది కూలీలు పనికి వస్తున్నారు...?

ఏపీవో: ప్రస్తుతం ప్రతి గ్రామం నుండి ప్రతి రోజు సుమారు 40 మంది కూలీల చొప్పున రోజు మండలంలో 900ల వరకు కూలీలు ఉపాధి హామీ పనులకు వస్తున్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి, ముథోల్)

ఆర్జీయూకేటీ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో బుధవారం స్పందన ఈడ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ టీం, కౌన్సిలింగ్, స్టూడెంట్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ టీం సభ్యులతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మనోధైర్యంతోనే మనో వికాసం జరుగు తుందని తెలిపారు. అధైర్యపడితే అపజయాలు ఆహ్వానిస్తాయని ధైర్యంగా ముందు కెళితే విజయం సోపానం అవుతుందని పేర్కొన్నారు. జీవితం చాలా విలువైనదని, విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడం చాలా ముఖ్యం. ప్రతి కూల ఆలోచనలను సానుకూలంగా మార్చుకోవాలి కానీ జీవితాన్ని అంత తేలికగా ముగించకూడదని ఫౌండర్ శామ్యుల్ రెడ్డి, డైరెక్టర్ జ్యోతిర్మయి విద్యార్థులకు తమ సలహాలను అందించారు. వీరి ఆధ్వర్యంలోనే సినీ నటుడు, మోటివేషనల్ స్పీకర్ ప్రదీప్ విద్యార్థులలో చాలా ఉత్సాహాన్ని నింపుతూ ప్రేరణ కల్పించారు. డాక్టర్ భాగ్యమ్మ మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్పందన ఫౌండేషన్ లక్ష్యాలను వారు చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. సైకాలజిస్ట్ శ్రీనివాస్ విద్యార్థులకు ప్రతికూల ఆలోచనలను సానుకూలంగా మార్చుకోవటానికి కావాల్సిన సూచనలు అందించారు. అధ్యాపక బృందానికి బోధన సమయంలో విద్యార్థులతో వచ్చే సమస్యలకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమం స్టూడెంట్స్ వెల్ఫేర్ సెక్షన్ సహకారంతో కౌన్సిలర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అసోసియేట్ డీన్ సైన్సెస్ విఠల్, కౌన్సిలర్లు నాగలక్ష్మీ, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శివలింగం, నవగ్రహాల ఊరేగింపు

బజార్‌హత్నూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిర్నూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో బుధవారం శివలింగం, నవగ్రహాల ఊరేగింపు గ్రామ పురవీధుల గుండా కన్నుల పండువగా జరిగింది. అనంతరం యజ్ఞయాగాలను నిర్వహించి వేద పండితుల సమక్షంలో ఆలయంలో శివలింగం, నవ గ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామంలో అన్నదానం నిర్వహించారు.



కన్నుల పండుగగా శివలింగం, నవగ్రహాల ఊరేగింపు చేస్తున్న భక్తులు



దంతనపల్లి వంతెన సమీపంలో ప్రమాదకరంగా మారిన చెట్లు

జర దేఖో!!



దంతన్‌పల్లి బీరుసాయిపేట మధ్య రహదారిపై వృక్షాలు

ప్రమాదకరంగా రోడ్డు పక్కన చెట్లు

● పట్టించుకోని అధికారులు

ఉట్నూర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలోని ప్రధాన రహదారుల వెంట దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు నేడు భారీ వృక్షాలుగా మారి ప్రమాదకరంగా తయారు అవుతున్న అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ మధ్య, ఉట్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్లకు ఇరువైపుల భారీ చెట్లు వంగి ఉన్నాయి. ప్రతియేటా వర్షాకాలంలో భారీ ఈదురు గాలులకు, వర్షాలకు చెట్లు పడిపోయి రవాణా వ్యవస్థను స్థంబింప చేస్తుండగా అర్ధాంతరంగా రోడ్ల పై వాహనాలు నిలిచి పోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు ఉట్నూర్ వైపు వస్తుండగా తోషం వద్ద ఉన్న ప్రధాన రహదారి పై వెళ్తున్న బస్సుపై చెట్టు కూలడంతో ప్రాణ నష్టం తప్పింది. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఉట్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే ప్రధాన రహదారి వెంట అడవులు ఉండగా రోడ్డు పక్కనే చెట్లు సైతం ఉన్నాయి. వంగిపోయిన చెట్లను ఆర్ అండ్‌బీ అధికారులు అడవి శాఖ అధికారుల అనుమ తి తీసుకొని తొలగిస్తే వాహనాలపై వెళ్లే ప్రయాణికులకు ఎ లాంటి హానీ జరుగకుండా చూడవచ్చని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ దిశగా ఆలోచన చేసి వంగిపోయిన చెట్లను తొలగించి ప్రయాణికులకు భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కోసం కృషి చేస్తాం

● ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ సాధిస్తాం ● సీసీఐ ఫ్యాక్టరీ అమ్ముడుపోలేదు: ఆదిలాబాద్ ఎంపీ నగేష్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ నగేష్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు కోసం కృషి చేస్తామని, దీనికోసం పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసి మాట్లాడినట్లు ఎంపీ గోడం నగేష్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిర్ ఫోర్స్ అకాడ మి కోసం 2014లో తాను ఎంపీగా ఉన్న సమ యంలో రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రిగా ఉన్న జోగు రామన్న ద్వారా అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని జిల్లా కేం ద్రంలో అకాడమి ఏర్పాటుకు 2014 లోనే 1592 ఎకరాలకు ప్రపోజల్స్ పంపించారని తెలిపారు. దాన్ని పూర్తి చేయాలని సీఎం కేసీ ఆర్ దృష్టికి మంత్రిగా ఉన్న జోగు రామన్న ద్వారా తీసుకెళ్తే హైదరాబాద్‌లో రక్షణ శాఖ తమకు భూమి ఇవ్వడం లేదని తాము ఎందుకు వెయ్యి ఎకరాలు ఎందుకు ఇవ్వాలని చెప్పారని జోగు రామన్న తనతో చెప్పారన్న విషయాన్ని మరిచిచిపోయి మాట్లాడుతున్నారన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం..

● ఎమ్మెల్యే పాయల శంకర్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలు అన్ని పరి ష్కారం అవుతాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జోగు రామన్న అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఏదైనా తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఒక సారి మంత్రిగా చేసిన జోగు రామన్న ఏం చేయకుండా తన సంవత్సరాల పదవీ కాలంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ అమ్ముడు పోయిందంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. కేవలం పాడైన వస్తువులు పరికరాలు మాత్రమే టెండర్‌కు ఇచ్చారన్నారు. అనుభవం ఉన్న వ్యక్తిగా జోగు రామన్న సలహాలు సూచనలు ఇవ్వలే తప్ప ప్రజలను తప్పుదోవ పట్టించేల మాట్లాడడం సరికాదని హితవు పలికారు. తమపై, తమ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు కాస్త ఓపికతో ఉండాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు త్వరలో శుభ వార్తలు వింటారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం రఘుపతి, లాలా మున్న, ఆదినాథ్, నగేష్, విజయ్, రాందాస్, వేదవ్యాస్, కృష్ణ యాదవ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం తరలింపు



రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్న కూలీలు

బోథ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోడౌన్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా బియ్యం పంపించడం జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. బుధవారం సివిల్ సప్లై గోడౌన్‌కు వచ్చిన బియ్యం లారీ నుంచి మరో ఐచర్ వాహనంలోకి బియ్యం పంపించడం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. వాస్తవానికి జీపీఎస్ ఉన్న వాహనంలోనే బియ్యం పంపించాల్సి ఉండగా సంబంధిత గోడౌన్ ఇన్‌చార్జ్ మరో వాహనంలో పంపించడం జరుగుతుందని పేర్కొంటున్నారు.

● **పాత కాంట్రాక్టర్ రాకపోవడం వల్ల**

జీపీఎస్ ఉన్న వాహనం పాత కాంట్రాక్టర్ వద్ద ఉందని గోదాం ఇంచార్జి పాండు పేర్కొన్నారు. అయితే ఇటీవల కొత్త కాంట్రాక్టర్ బియ్యం సప్లైకి ముందుకు రావడం జరిగింది అన్నారు. అయితే కొత్త కాంట్రాక్టర్ వాహనానికి ఇంకా జీపీఎస్ కాలేదని త్వరలోనే జీపీఎస్ వస్తుంది అన్నారు. కాగా ఈ విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారులు వివరణ కోరగా పాత కాంట్రాక్టర్ ముందుకు రాలేదని బియ్యం పంపించడం తప్పనిసరి కావడంతో జీపీఎస్ రాకముందే బియ్యం మరో వాహనంలో పంపించడం జరిగిందన్నారు.

● **తూకం వేయకుండానే..**

గోదాంకు వచ్చిన బియ్యం తూకం వేయకుండానే ఎవరేజ్‌గా 50 కిలోల బరువుతో ఒక వాహనం నుండి మరో వాహనంనకు మార్చి పంపించడం జరుగుతుంది. వాస్తవానికి తూకం వేసి డీలర్లకు పంపిణీ చేయాల్సి ఉండగా అధికారులు మాత్రం నేరుగా పంపించడంతో డీలర్లు నష్టపోవాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై గోదాం ఇంచార్జిని వివరణ కూడా గతంలో నుండి ఇదేవిధంగా పంపిస్తున్నామని బస్తాబియ్యం 50 కిలోలు ఉంటుందని తక్కువ రాదన్నారు.

పొచ్చెర వాసికి ఇంటర్నేషనల్ అవార్డు ప్రదానం

బోథ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన బిట్లింగు ముత్తన్నకు బుధవారం ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్, ఆస్ట్రాలజర్ వెల్ఫేర్ ట్రస్ట్ తమిళనాడు వారి ఆధ్వర్యంలో నాల్గవ ఇంటర్నేషనల్ అవార్డు అందించారు. తెలుగు యూనివర్సిటీలో సైంటిఫిక్ ఆస్ట్రాలజర్ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నా రు. అవార్డుతో తనపైన మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న బి. ముత్తన్న



నాసిరకం ఇసుకతో పనులు చేస్తున్న కార్మికులు

నాసిరకంగా ప్రహరీ నిర్మాణం

కుభీర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రహరీ నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టింది. ఈ నిర్మాణ పనులకు అధికారుల పర్యవేక్షణ కరువైంది. పనులు ప్రారంభమైన నుంచి సంబంధిత అధికారులు రాకపోవడంతో నిర్లక్ష్యం స్పష్టం అవుతోంది. సాధారణంగా ఏదైనా నిర్మాణ పనులు జరగేటప్పుడు సంబంధిత ఇంజనీర్లను, సూపర్‌వైజర్లను పనులను పరిశీలించేందుకు కేటాస్తారు. కాని మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రహరీగోడ పనులలో కార్మికులే పనులు తోచినట్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పర్యావేక్షణ కరువైంది. పనుల్లో నాణ్యత లోపిస్తోంది. ఈ విషయమై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాదానాలను చెపుతూ దాటవేస్తున్నారు. సంబంధిత ఇంజనీర్లకు ఫోన్‌లో సంప్రదించగా ఫోన్ ఎత్తడం లేదు. ఇప్పటికయిన జిల్లా స్థాయి అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలతో ప్రహరిగోడను నిర్మించి పదికాలాలు మన్నికగా ఉండేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

పామ్ ఆయిల్ సేద్యంపై అధ్యయనం

● జాఫ్రాపూర్ విద్యార్థుల క్షేత్ర సందర్శన



పామ్ ఆయిల్ పంటను సందర్శిస్తున్న విద్యార్థులు

సోన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామానికి సమీపంలో ఉన్న పామ్ ఆయిల్ పంటను సందర్శించి సాగు వివరాల గురించి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యా యులు తోడిశెట్టి పరమేశ్వర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు పామ్ ఆ యిల్ పంట చేన్లను సందర్శించి దాని సైద్యం, పంట దిగుబడి, మార్కెటింగ్, భవిష్యత్‌లో దాన్ని లాభాల్లోకి ఎలా తీసుకెళ్లాలో అన్న విష యాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నగేష్ కుమార్, విజయమాల, ఆసిఫ్ అలీ, అనుపమ, శ్రీనివాసరావు పాల్గొ న్నారు.

దారి వెంట మురుగు



యూనియన్ బ్యాంక్ ముందు రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కుభీర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ముందు రహదారిపై మురుగు పారుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు బ్యాంకు వచ్చే కస్టమర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు ప్రతి రోజు వందలాదిగా బ్యాంకుకు వస్తుంటారు. ఇక్కడ మురుగు నీరు ప్రవహించడంతో మురుగు నీటిలోనే నడుస్తూ బ్యాంకు వెలుతున్నామని కనీసం ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేద్దామన్న ఇబ్బంది ఉందని వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు వారం రోజులుగా చెబుతున్న పట్టించుకోవడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

బస్టాండ్‌లో నీటి వసతిని కల్పించాలి



ప్రయాణ ప్రాంగణంలో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కుభీర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం ఆవరణలో కనీసం తాగు నీరు సౌకర్యం లేదు. నిత్యం వందలాది సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం ప్రాంగణం వద్ద నిరీక్షిస్తుంటారు. ఇప్పటికే ఎండలు మండిపోతూ ఉష్ణోగ్రత రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రయాణ ప్రాంగణం చుట్టు పక్కల ఎక్కడ తాగు నీటి వసతి లేదు. రానున్న మరో రెండు మూడు నెలల్లో ఎండల తీవ్రత పెరిగే నేపథ్యంలో నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ ఆవరణలో తాగు నీటి వసతిని కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అద్దె భవనంలో గ్రామ పంచాయతీ

● అవస్థల్లో అధికారులు
● నత్తనడకన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం



అద్దె భవనంలో కొనసాగుతున్న పల్లికే గ్రామ పంచాయతీ భవనం



ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

తలమడుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తల మడుగు మండలం పల్లి కే గ్రామ పంచాయతీ భవనం అద్దె భవనంలో కొన సాగడంతో గ్రామపంచాయతీ సిబ్బందికి, అధికారులకు గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో గ్రామంలో గల భవనాలను అద్దెకు తీసుకొని గ్రామ పంచాయతీ పాలనను సాగిస్తున్నారు. పల్లి కే గ్రామంలో ఉన్న అద్దె భవనం అరకొర వసతులు ఇరుకు గది గ్రామపంచాయతీ పత్రాలు పెట్టడానికి కూడా స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామపంచాయతీ సెక్రెటరీ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రామ సభ. ఇతర సమావేశాలు ఏర్పాటు చేయాలంటే. చెట్ల కింద. లేదా రోడ్డుపైన ఏర్పాటు చేయించుకోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయ న్నారు. కాగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద. మంజూరైన నూ తన గ్రామపంచాయతీ భవనం పనులు నత్తనడకన సాగుతుండడంతో సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పను లు చేపడుతున్నప్పటికీ ఇప్పటివరకు బిల్లుల రాకపోవడంతో పనులు చే యాలంటే. ఇబ్బందిగా ఉందని సదర కాంట్రాక్టర్ తెలిపారు. ఇకనైనా అధికారుల స్పందించి నత్తనడకన సాగుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో త్వరగా పూర్తిచేసి గ్రామస్థులకు ఇబ్బందులు కలవకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



రూ.10 కోట్ల నిధులపై.. పంచాయితీ

- బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ
- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల మంజూరుపై అభ్యంతరాలు
- పనుల విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేతలు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు వాయిదా
- నేతల ఒత్తిళ్లతో అభివృద్ధి పనులపై అంతా అయోమయం

ఆదిలాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పంచాయితీ నెలకొంది. దళిత వాడల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల విషయంలో ఇరు పార్టీల మధ్య వివాదానికి దారి తీస్తోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.10 కోట్ల ప్రతిపాదనలను పంపించారు. దీంతో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఆమోదంతోనే నిధులు మంజూరైనట్లు తెలుస్తుంది. అయితే అధికార పార్టీ నేతలను కాదని ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యే ప్రతిపాదనలకు ఎలా నిధులు మంజూరు చేస్తారంటూ కొంత మంది కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై అధికార కాంగ్రెస్ పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. పార్టీ అధికారంలో ఉన్న తమకు ప్రాధాన్యతను ఇవ్వడం లేదంటూ పలువురు నేతలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం ఇచ్చోడ మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ విషయాన్ని కొందరు నేతలు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. అయితే ఇప్పటికే నిధులు మంజూరుకావడంతో ఎమ్మెల్యే ఆదేశాలతో నేతలు పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అర్ధాంతరంగానే నిలిపి వేశారు. అంతేకాకుండా మరో రెండు మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ ముగియనుంది. ఇప్పటికే ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.10 కోట్ల నిధులతో పనులు చేపట్టే విషయమై ఇంకా స్పష్టత లేకపోవడంతో సందిగ్ధమే కొనసాగుతోంది.

నిధులపై భిన్నాభిప్రాయాలు

బోథ్ నియోజక వర్గానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధులపై అధికార పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ప్రతిపాదనలను పక్కన పెట్టి నిధులను మంజూరు చేయడం ఏమిటన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఆమోదంతోనే మంజూరైన నిధులపై కాంగ్రెస్‌లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేతలను కాదని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలకు పనులు ఎలా అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇరు పార్టీల నేతలు జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసిం ది. అయితే ఎమ్మెల్యే పంపిన ప్రతిపాదనలకే మంత్రి ఆమోదం తెలిపినట్లు తెలుస్తుంది. దీంతో కాంగ్రెస్ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అసలే బోథ్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, కార్యకర్తలను కాపాడుకోకుంటే పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉందంటున్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందాలంటే కార్యకర్తలను ఆదుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరం ఉందంటున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చినా.. ఏం ప్రయోజనమే లేదన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

తీర్మానాలు వెనక్కి..

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల మంజూరుతో పలు గ్రామాల్లో పనులు చేపట్టేందుకు కొందరు బీఆర్ఎస్ నేతల గ్రామ పంచాయతీ తీర్మానాలు తీసుకున్న ట్లు తెలుస్తుంది. ఆ వెంటనే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు కొన్ని చోట్ల ఇచ్చిన తీర్మానాలను వెనక్కి తీసుకున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ఎవరికి తీర్మానాలు ఇవ్వరాదంటూ జిల్లా ఉన్నతాధికారులే ఆదేశించడంతో నిలిపి వేశారు. రూ.10 కోట్ల నిధులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య వివాదం ముదరడంతో గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. ఎన్నికల కోడ్ తర్వాత గ్రామాల్లో తీర్మానాల కోసం ఇరు పార్టీల నేతలు అధికారులపై ఒత్తిళ్లు చేసే అవకాశం కనిపిస్తోంది. సబ్ ప్లాన్ నిధుల విషయంలో ఇరు పార్టీల ముఖ్యనేతలు పట్టుబట్టడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో తీర్మానం కోసం అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తీర్మానాలు ఇవ్వలేమని అధికారులు చెబుతున్నా.. అభివృద్ధి కోసం అధికారులు ఎందుకు సహకరించరంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పంచాయతీల పాలకవర్గాలు లేకపోవడంతో అధికారుల నిర్ణయ మే కీలకంగా మారింది. అయితే పనులను ఎవరూ చేపట్టిన ఫర్వాలేదు. కానీ అభివృద్ధి జరగడమే ప్రధానమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి.

పట్టుబడుతున్న నేతలు

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై ఇరు పార్టీల నేతలు పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. తమ అనుచరులకు అండగా నిలిచి పనులు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలే కీలకమని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. కాంగ్రెస్‌లో మాత్రం భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే నిధులు మినహా అన్నిరకాల నిధులను

(తరువాయి 6వ పేజీలో...)







మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

రిమ్స్‌లో ప్రైవేట్‌కు దీటుగా వైద్య సేవలు

- 4 క్యాన్సర్ సర్జరీలు విజయవంతం : రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్నిరకాల క్యాన్సర్ వ్యాధులకు చికిత్సలను అందిస్తున్నామని, ప్రైవేట్‌కు దీటుగా రిమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. బుధవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రిమ్స్ డాక్టర్లు సక్సెస్ చేసిన 4 క్యాన్సర్ ఆపరేషన్‌ల గురించి ఆయన వివరించారు. ఆదిలాబాద్‌కు చెందిన పోచ్చక్క, ఆశన్న, నాందేవ్, మీనాక్షి అనే నలుగురు రోగులు ఆస్పత్రిలో చేరగా.. వారికి యువ డాక్టర్లు విజయవంతంగా సర్జరీలు చేశారని పేర్కొన్నారు. నాలుగు ఆపరేషన్‌లో క్యాన్సర్‌తో పాటు న్యూరోకు సంబంధించిన ఉన్నాయని.. వాటిని ఎనిమిది నుంచి తొమ్మిది గంటలకు కష్టపడి విజయవంతం చేసినట్లు తెలిపారు. టీం కూడా సర్జరీలో వైద్యులకు ఎంతో సహకారం అందించిందన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా రిమ్స్‌లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఇవే ఆపరేషన్‌లు ప్రైవేట్‌లో చేసుకుంటే రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అయ్యేదని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 400 కేసులు టేకప్ చేసి వైద్యులు విజయవంతంగా ఆపరేషన్‌లు పూర్తి చేసినట్లు వివరించారు. ఇందులో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, వైద్యులు జక్కుల శ్రీకాంత్, మోహన్, బండారి నరేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మేస్త్రీలకు శిక్షణ : జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపిక చేసిన మేస్త్రీలను శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు మేస్త్రీలకు ఇచ్చే శిక్షణ బుధవారం ప్రారంభమైంది. కాగా, జడ్పీ కార్యాలయంలో పలువురు మేస్త్రీలకు కిట్లను అందించారు. ప్రభుత్వం పేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతోందని కలెక్టర్ వివరించారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. బుధవారం ఎస్పీ జిల్లా పోలీసులతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్‌లు, స్పీడ్ లేజర్ గన్ ఏర్పాటు చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి : న్యాయాధికారి

బోథ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీయ అవకాశం ఉన్న కేసులను భూ తగాదాలు కుటుంబ తగాదాలను పదాలతో పరిష్కరించుకోవచ్చని ఆమె సూచించారు. సివిల్ క్రిమినల్ బ్యాంక్ కేసులు పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తుడుందెబ్బ నాయకులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నార్నూర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత వాసులు 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని తుడుందెబ్బ గాదిగూడ మండల అధ్యక్షుడు మడావి చంద్రహరి అన్నారు. బుధవారం మండలంలోని కొమురం భీం విగ్రహం దగ్గర సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. వారి వెంట రాయి సెంటర్ గితేదార్ కొడప జాకు, పెందుర్ సంతోష్, సోమ్ము పటేల్, దేవ్‌రావ్, లింగు, బీర్షా, తదితరులు పాల్గొన్నారు.

హరినామ సప్తాహ ముగింపు

ఉట్నూర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరి తండా గ్రామ సమీపంలోని గోవింద్ స్వామి మఠం ఆవరణలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం బుధవారం ముగిసింది. కీర్తన్‌కార్ శ్రీహరి భక్త భాస్కర్ మహరాజ్ సాండూల్కర్ వారి కీర్తనల ద్వారా ప్రజలను జాగృతం చేశారు. ప్రతీఒక్కరు దైవచింతనతో ఉన్నప్పుడే సుఖసంతోషాలు వస్తాయని వివరించారు. ఇందులో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజి, కొమ్ము రాంచందర్, యోగేష్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'దుబార్‌పేట్ సమస్యలు పరిష్కరిస్తా'

నేరడిగొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామస్తులు బుధవారం మండల కేంద్రంలో గల బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్‌లు, మహిళలు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే గ్రామాన్ని సందర్శిస్తానని, గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, గ్రామ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 9,814 మంది విద్యార్థులకు గాను 9,154 మంది హాజరు కాగా.. 660 మంది గైర్హాజర్
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



ఆదిలాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



ఇంద్రవెల్లిలో తనిఖీ చేసిన ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా కొనసాగాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే విద్యార్థి కళాశాల, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, సీసీ కెమెరాలను పరిశీలించారు. కాగా, జిల్లాలో తొలి రోజు మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసిందని డీఐఈవో జాదవ్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. 9,814 మంది విద్యార్థులకు గాను 9,154 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 660 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఇవాళ తెలుగు, హింది, సంస్కృత్, ఉర్దూ, అరబిక్ పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు.

ఇంద్రవెల్లి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం మండల కేంద్రంలోని రెండు కేంద్రాల్లో సజావుగా సాగింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రిస్టియంట్ రెండు కేంద్రాల్లో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో మొత్తం 277 విద్యార్థుల్లో 23 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ క్రిసియంట్ జూనియర్ కళాశాలలో 170 మందికి, ఐదుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బోథ్: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు ప్రభుత్వం విధించిన సమయానుకూలంగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు రాసేముందు విద్యార్థులను ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి పంపించడం జరిగింది. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను స్థానిక సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్ కుమార్లు మాస్ కాపీయింగ్ జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

గుడిహత్నూర్: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరంలో తొలి రోజు మొత్తం 262 మంది విద్యార్థులకు గాను 259మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ రాజేందర్ తెలిపారు. పరీక్షాకేంద్రాన్ని తహసీల్దార్ కవితారెడ్డి, ఎస్సై మహేందర్ సందర్శించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. బుధవారం మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కాగా, విద్యార్థులు మొత్తం 223 మంది హాజరు కావాల్సి ఉండగా.. మొత్తం 207 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఉట్నూర్: మండలంలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 346 మంది, బాలికల గురుకుల కళాశాలలో 348 మంది, లాల్‌టేకిడి గురుకుల జూనియర్ కళాశాలో 368 మంది, చైతన్య జూనియర్ కళాశాలలో 272 మంది, పూలాజిబాబా జూనియర్ కళాశాలలో 438 మంది, ఏఆర్ఎస్‌జూనియర్ కళాశాలలో 304 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. ఆరు పరీక్ష కేంద్రాలలో 279 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని నిర్వాహకులు తెలిపారు. పరీక్షల సమయంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం ఉండవద్దని జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారులు సూచించినప్పటికీ.. బుధవారం ఉదయం పరీక్షలు ప్రారంభమయ్యే తొమ్మిది గంటల సమయంలో ఈదురుగాలులు వీచడంతో కరెంట్ అంతరాయం ఏర్పడింది. సుమారు గంట పాటు కరెంట్ అంతరాయం ఏర్పడడంతో విద్యార్థులకు ఇబ్బంది జరిగినట్లు తెలుస్తుంది. ఈ విషయమై విద్యుత్ అధికారులను ప్రశ్నించగా.. గాలి వీస్తుండడంతో ఇబ్బంది అవుతుందని, వెంటనే పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ఉట్నూర్ మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తనిఖీ చేసి పరిశీలించారు. విద్యార్థులందరు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, ఎలాంటి కాపీలకు తావు ఇవ్వవద్దని నిర్వాహకులను ఆదేశించారు.

కాగా, మండలంలోని లాల్‌టేకిడి గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు గాదిగూడకు చెందిన ఒక మహిళ తన ఐదు నెలల పసిపాపతో తల్లిని వెంటబెట్టుకుని హాజరయ్యింది. పరీక్ష రాయడానికి ఆమె సెంటర్‌కు వెళ్లగా.. పసిపాప ఆలనా పాలనను అమ్మమ్మే చూసుకుంది. వెంట తెచ్చుకున్న చీరతో ఊయల కట్టి పరీక్ష అయ్యే వరకు ఆడించడం గమనార్హం.

జైనథ్: మండల కేంద్రంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో జైనథ్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు 77 మందిలో ఇద్దరు గైర్హాజరు కాగా.. మిగతా వారు పరీక్ష రాశారు. అదేవిధంగా జైనథ్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు 191 మందిలో ఒకరు గైర్హాజరు కాగా.. మిగతా విద్యార్థులు పరీక్ష రాశారు. వృత్తి విద్య ఎంపీహెచ్‌డబ్ల్యు మొదటి సంవత్సరంలో 43 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జైనథ్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పరీక్షల కేంద్రాన్ని జైనథ్ మండల తహసీల్దార్ ఆత్రం నారాయణ, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తంలు తనిఖీ చేశారు.



బోథ్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారులు



ఉట్నూర్ మండలం లాల్‌టేకిడి పరీక్ష కేంద్రం సమీపంలో పసిపాపను చీరతో ఊయల కట్టి లాలిస్తున్న అమ్మమ్మ

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
ఇఫ్తార్	సహర్
సా.6.29	ఉ.5.08



సత్య, అసత్యాలు తెలుసుకోకుండా.. విన్నది విన్నట్లు ఇతరులకు ప్రచారం చేసేవాడు కూడా అబద్ధం చెప్పినట్లే.

జీతాలు చెల్లించాలని సపాయి కార్మికుల ధర్నా

- స్పెషల్ ఆఫీసర్ పట్టించుకోవడం లేదని ఆరోపణలు

నార్నూర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జీతాల కోసం గ్రామ పంచాయతీ సపాయి కార్మికులు బుధవారం మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలు గడిచినా జీతాలు చెల్లించలేదని, మా కుటుంబాలు ఎలా పోషించాలి? ఏమి తినాలి? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్‌ని ప్రతీసారి అడుగుతున్నా.. చూద్దాం, చేద్దాం మాటలతో దాటేస్తున్నారు తప్ప జీతాలు ఇవ్వడం లేదంటూ సపాయి కార్మికులు ఆరోపించారు. ఇవ్వాల్సిన జీతాలు సైతం జనరల్ ఫండ్‌లో కొట్టడం వలన అవి చాలా వరకు నెలాల కొద్ది సమయం పడుతోందని, అలాంటిది తాము గ్రామంలో ఒక్కరోజు పారిశుధ్యం పనులు చేయకుంటే ఇబ్బందులు తప్పవని విరించారు. అలాంటి తాము పని చేసినా పని వేతనం ఇవ్వడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. తమకు జీతాలు చెల్లించని పక్షంలో జిల్లా పాలన అధికారిని కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఇందులో పెళ్లి బాపురావు, పాందారి సురేందర్, జాడే కిరణ్, చునార్కర్ గంగారాం, మహరాజ్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సపాయి కార్మికులు